## రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ కాత్యాయిని

**పుట్లూరు, నవంబర్ 5 ప్రభాతవార్త**

మండలంలోని శనగలగూడూరు. తక్కళ్లపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిని కాత్యాయిని మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పప్పుశనగ పంటలో తేమశాతం ఎక్కువగా ఉందని, కావునా కొంచెం తేమ ఆరిన తరువాత విత్తన శుద్ధి చెయ్యని రైతులు సాఫ్‌ని రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి భూమి తడిచేలాగా స్ప్రేయింగ్ చేయాలన్నారు. పప్పుశనగలో వచ్చే శనగపచ్చ పురుగు నివారణకు తప్పనిసరిగా ఎమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు లేదా క్లొరాంట్రనిలిప్రోల్ 60 మీ.లి ఏదో ఒకటి పిచికారి చేసుకోవాలని ఏఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఇఓ చిన్న నాగిరెడ్డి, ఎంపిఇఓ రాజ్యలక్ష్మి, సావిత్రి, రైతులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో ప్రత్యేక పూజలు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

**యల్లనూరు, నవంబర్ 5 ప్రభాతవార్త**

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని కోటవీధి, పాతపేట మండలంలోని 85 నిట్టూరు గ్రామాల్లో వెలసిన శివాలయాల్లో బుధవారం శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు ఆలయాలకు చేరుకొని దీపాలు వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు హజరై శివున్ని దర్శించు కున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం



ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమైన దృశ్యం

**పుట్లూరు, నవంబర్ 5 ప్రభాతవార్త**

పుట్లూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో ఎంపిడిఓ అలివేలమ్మ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఈకెవైసి, ప్లానింగ్‌లో కొత్తపనుల గుర్తింపు, ఎస్‌సి, ఎస్‌టి పనిరోజులు, 60 రోజులు దాటిన కుటుంబాలకు 100 రోజులు పూర్తి చేయుట, రిజిస్టర్ అప్డేషన్, హార్టికల్చర్ ప్లాంటేషన్, కంపోస్ట్ పిట్స్, ఇండివిజువల్స్ సోక్ పిట్స్, తదితర అంశాల గురించి రివ్యూ చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఏపిఓ, ఈసిటిఏలు, బిఎఫ్‌టిలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తిక పౌర్ణమి వేడుకలు

- కార్తిక దీపాల కాంతులలో వెలుగొందిన శివాలయాలు

**నంబులపూలకుంట, నవంబర్ 5 ప్రభాతవార్త**

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. వేకువజామునుండే అర్చనలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నంబులపూలకుంట శివాలయంలో తెల్లవారు జాము నుంచి స్వామి మూల విరాట్‌ను అభిషేకం చేశారు. పురోహితులు, పండితులు శాస్త్రోక్తంగా స్వామిపై ప్రార్థనలు చేశారు. స్వామి మూల విరాట్‌ను వివిధ రకాలపూలతో అలంకరించారు. కార్తికపౌర్ణమి వేడుకలలో మహిళలు అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు. పంచామృతాభిషేకం, మహ మంగళహారతి అనంతరం ప్రసాదాన్ని వితరణ చేశారు. తిరిగి రాత్రి కార్తిక మాస పూజలను నిర్వహించి, దక్షాన్ని కాల్చారు. సాయంత్రం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు ప్రత్యేకంగా పున్నమి వేడుకలను నిర్వహించారు. కార్తిక పున్నమి శివునికి ఇష్టమైన ప్రీతికరమైన రోజు ఈ కార్తిక దీపాలను శివుని దేవాలయం వద్ద, గుడిలో వెలిగిస్తే అంతా శుభం, మంగళకరం జరుగుతుందని, ఐశ్వర్యం సిద్దిస్తుందని భక్తుల విశ్వాసం. మహిళలు శంకరేశ్వర స్వామి దేవాలయం లోపల కార్తిక దీపాలను వెలిగించారు. కార్తిక దీపాలను పసుపు కుంకుమతో, పూలతో అలంకరించి కార్తిక దీపాలను మహిళలు వెలిగించారు. ఉసిరి కాయ పెట్టి కార్తిక దీపాలను వెలిగిస్తే ఐశ్వర్యం సిద్దిస్తుందని భక్తుల విశ్వాసం.

## ఎన్ ఆర్ ఫర్టిలైజర్స్ షాప్ లైసెన్స్ రద్దు





ఎన్ ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం షెటర్ కు లైసెన్సు రద్దు కాపీని అతికిస్తున్న అధికారులు.

**అనంతపురం రూరల్, నవంబర్ 05 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం పాపంపేట పంచాయతీలో గల ఎన్ ఆర్ ఫర్టిలైజర్ షాప్ షె ట్ట రు పై లైసెన్స్ రద్దు కాపీని అతికించడం జరిగిందని ఏడిఏ జి ఎం అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు. ఎన్ ఆర్ ఫర్టిలైజర్ షాప్ ఎరువు ల లైసెన్స్ రద్దు చేసిన సందర్భంగా ఆ రద్దు కాపీని దుకాణం దారుడు తీసుకోవడానికినిరాకరించడంతో బుధవారం మండలం వ్యవసాయ అధికారి వెంకట కుమార్, విఆర్ఓ ల తో సంయుక్తంగా కలిసి వెళ్ళగా దుకాణం దారుడు షాపు మూసి వేయడం జరిగిందని, దుకాణం మూసి ఉంచడం వల్ల దుకాణం షట్టర్ పై ఎరువు ల లైసెన్స్ రద్దు ఆదేశాల కాపీ ని అతికించి పంచనామా కార్యక్రమం నిర్వహించామని ఏ డి ఏ జి ఎం అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు.

## జాతీయస్థాయికి తాడిపత్రి క్రీడాకారుడు ఎంపిక

**తాడిపత్రిటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త**

ఈ నెల 3, 4 తేదీల్లో ఏలూరు, వెస్ట్ గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో సెలక్షన్ పోటీలలో తాడిపత్రికి చెందిన తైక్వాండో క్రీడాకారుడు అనిల్ ప్రతిభ చాటాడు. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన అనిల్ ఈ నెల 25న అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మాస్టర్ తైక్వాండో సాయి మాట్లాడుతూ అనిల్ రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఆనందకరమని, జాతీయ స్థాయిలో కూడా రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ నరేష్, తల్లితండ్రులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారుడు

## వాల్మీకి బోయల దృఢ సంకల్ప దీక్షను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

**యాడికి, నవంబర్ 5 ప్రభాతవార్త**

వాల్మీకి బోయల దృఢ సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాయలచెరువు గ్రామంలోని వాల్మీకి విగ్రహం వద్ద వాల్మీకి సంఘం జిల్లా యువజన నాయకుడు బాలసుంకయ్య, సంఘం సభ్యుల ఆధ్వర్యంలో దృఢ సంకల్ప దీక్ష పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపోయిన వాల్మీకి జాతి కోసం ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో 2025 మంది వాల్మీకి బోయలతో దృఢ సంకల్ప దీక్షను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరిని నిరసిస్తూ ఈనెల 10వ తేదీ సోమవారం కర్నూల్‌లోని గౌరీ గోపాల్ ఆసుపత్రి ఎదురుగా ధర్నా చౌక్ నందు వాల్మీకి విగ్రహం ఎదురుగా ఈ దీక్షను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వాల్మీకి బోయలకు ప్రాంతీయ వ్యత్యాసాలు తొలగించి ఎస్‌టి జాబితాలో చేర్చాలని, అన్ని విధాలుగా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఏ పార్టీ అయినా ఏ ప్రభుత్వం అయినా వాల్మీకి బోయల అభివృద్ధి సాధికారత కోసం కృషి చేయడం లేదంటూ మన ఓట్లతో గద్దెనెక్కిన వారు మన కన్న తక్కువ జనాభా ఉన్నవారు మనల్ని అణగదొక్కడం చాలా దారుణమన్నారు. ఈ నెల 10న నిర్వహించే దృఢ సంకల్ప దీక్షలో వాల్మీకి బోయలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాల సుంకయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం సభ్యులు తలారి శివయ్య, సుధాకర్, విశ్వనాథ్, మెకానిక్ బాబు, కృష్ణయ్య, రామాంజి, రంగానాయుడు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై ఫైర్ అయిన కౌన్సిలర్లు

**తాడిపత్రిటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న టిడిపి కౌన్సిలర్లు

ఫ్యాక్షనిజాన్ని పెంచి పోషించింది నువ్వే అంటూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై టిడిపి కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్న అధికారంలో లేకపోయినా కూడా పోలీసులు నీకు ఎప్పుడు సెక్యూరిటీని ఇచ్చారు నువ్వు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నలుగురు గన్‌మెన్లతో ఎలా అయితే అరాచకాన్ని సృష్టించావో ఈరోజు అధికారం లేనప్పటికీ కూడా నువ్వు ఇంత స్వేచ్ఛగా తిరుగుతున్నావు అంటే అది ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి దయాదాక్షిణ్యాల వల్లనే అన్నారు. యాడికి మండలం వెంగన్నపల్లె గ్రామంలో గత నెలరోజుల క్రితం వైసిపి వాళ్ళు టిడిపి వారిపై కొడవలితో దాడి చేస్తే 307 కేసు నమోదు అయినా కూడా 10 మంది ముద్దాయిల్లో ఒక్కరిని కూడా ఇంత వరకు అరెస్ట్ చేయలేదన్నారు. మమ్మల్ని ఇంత వరకు అరెస్ట్ చేయలేదని వైసిపి వారు కవ్వింపు చర్యలు చేసిన కారణంగానే వెంగన్నపల్లిలో ఈ రోజు జరిగిన సంఘటన అని, మేము గొడవ చేసినామని అంటున్నారే పాతకోటలో మేము ప్రచారానికి వెళితే అక్కడికి వచ్చింది మీ దగ్గర ఉన్న రౌడీషీటర్లు, డబల్ మర్డర్ చేసినవాళ్లు గంజాయి, బెట్టింగ్, ప్రోత్సహించినవాళ్లను నీ దగ్గర పెట్టుకొని కోటి సంతాకాల పేరుతో వీళ్లందరిని అక్కడికి పంపించి గొడవలు సృష్టిస్తున్నావన్నారు. ఇప్పటికైనా పెద్దారెడ్డి నీ ఫ్యాక్షన్ బుద్ధులు తగ్గించుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కౌన్సిలర్లు షెక్షావలి, మల్లికార్జున, విజయ్‌కుమార్‌లు పేర్కొన్నారు.

## విద్యుత్ ప్రమాదల నివారణపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, సిబ్బంది

**తాడిపత్రిటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త**

పట్టణ సమీపంలోని బొజ్జయ్య కళ్యాణమండపంలో బుధవారం సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, ఫీల్డ్ సిబ్బందికి విద్యుత్ ప్రమాదల నివారణ, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా గుత్తి డివిజన్ ఈఈ పద్మనాభపిళ్ళై, ఏపిటిఎస్ సిఐ విశ్వనాథ్, కమర్షియల్ ఏడిఇ రామకృష్ణ, ఆపరేషన్ ఏడిఇ ప్రభాకర్‌రావు, సిసిఇ ఏడిఇ వసంతయ్య, సెక్షన్ అధికారులు వీరాంజనేయరెడ్డి, నరసింహులు, రాజారావు, పద్మనాభరెడ్డి, విజయ్. ఆధ్వ ర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రమా దాలను ఏ విధంగా నివారించాలి అనే వాటిపై తగు సూచనలు సలహాలు అంద చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ స్టేషన్ ఆపరేటర్స్, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా కార్తీకపౌర్ణమి వేడుకలు



గండా దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, తోరణాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు పరమేశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని పంచముఖ కవచంతో పాటు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక ంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయం ఆవరణలో అర్చకులు నందుస్వామి పలువురు భక్తులచేత శ్రీకేదారనోములను భక్తిశ్రద్ధలతో చేయించారు. ఆలయం మహాద్వారం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన గండా దీపోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని ఆలయ ఇఓ రామాంజినేయులు, కమిటీ చైర్మన్ చంద్రమోహన్, సభ్యులు రంగనాథరెడ్డి, తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా ముస్తాబుచేశారు. ఆలయం వద్ద పట్టణ సిఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శివాలయం నందు ప్రత్యేక పూజలు పాల్గొన్న ఆర్డీవో వి.వి ఎస్ శర్మ కుటుంబ సభ్యులు



శివాలయం నందు ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆర్డీవో కుటుంబ సభ్యులు

**నల్లచెరువు, నవంబర్ 5, ప్రభాతవార్త**

నల్లచెరువు మండల కేంద్రంలోని భక్త మార్కండేయ శివాలయం నందు బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల పిలుపు మేరకు భక్త మార్కండేయ శివుని పూజ కార్యక్రమాలకు హాజరై శివుని దర్శించుకున్నారు . అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దృశ్యాలతో దంపతులకు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు జింక ఆదినారాయణ. వైస్ ప్రెసిడెంట్ జక్కా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు, నారాయణస్వామి.అరుణ్, చంద్రశేఖర, రామకృష్ణ రామ్మోహన్ నరేష్, మహేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సంస్థాగత ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 5, ప్రభాతవార్త**

సంస్థాగత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ బలోపేతానికి అందరూ కలసికట్టుగా కృషి చేయాలని నాయకులు రొద్దం ఉత్తమరెడ్డి, కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వీరాంజినేయులు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులకు ప్రవాస్ యోజన కార్యక్రమంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో బిజెపి అతిపెద్ద రాజకీయ పార్టీ అని, అలాంటి పార్టీలో పని చేయడం ప్రతి కార్యకర్తకు గర్వకారణం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లోకి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ముందుకు రావాలన్నారు. అప్పుడే బిజేపి పట్ల ప్రజల్లో విశ్వాసం కలుగుతుందని స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసివస్తుందని సూచించారు. సమావేశంలో నాయకులు రంగారెడ్డి, ఆశ్వర్థప్ప, నరసింహులు, రాజశేఖర్, బిజేవైఎం నరేష్, చంద్రారెడ్డి, రమణ, సురేష్, చలపతి, మేకల వెంకటరమణ, నాగప్ప పాల్గొన్నారు.

## శివాలయం నందు ప్రత్యేక పూజలు

**నల్లచెరువు నవంబర్ 5, ప్రభాతవార్త**



కార్తీక దీపాలతో కిటకిటలాడిన భక్త మార్కండేయ శివాలయం

మండల కేంద్రంలోని కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం భక్త మార్కండేయ శివాలయం నందు షిరిడి సాయిబాబా గుడి నందు మహా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయ మంత్రం మహాశివునికి. పురోహితులు సురేష్ స్వామి,ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్ విగ్రహానికి సుగంధ ద్రవ్యాలు ప్రత్యేక అభిషేకాలు అర్చనలు ప్రత్యేక పుష్పాలతో స్వామివారికి అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ కోర్కెలతో వేలాది దీపాలు వెలిగించి "ఓం నమ: శి వాయ" నినాదాలతో భక్తి గీతాలు దీక్షతో స్వామి సేవలో పాల్గొన్నారు అనంతరం మహాశివుని మూల విరాట్ కు అఖండ జ్యోతి నీ వెలిగించి భక్తులు కనువిందుగా తిలకించి దర్శనం చేసుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## నాగిరెడ్డిపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు.

**అనంతపురం రూరల్, నవంబర్ 05 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం ఎ.నారాయణపురం పంచాయతీ నాగిరెడ్డిపల్లి లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.వెంకట కుమార్ మాట్లాడుతూ రబీలో పంటలను సాగుచేటప్పుడు విత్తన శుద్ధి కాన్ఫిడర్ తో ఖచ్చితంగా చేసుకోవాలి దీనివలన 30 నుంచి 40 రోజుల వరకు పంటను రసం పీల్చు పురుగుల నుంచి కాపాడు కోవచ్చని, ట్రైకోడర్మావిరిడితో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల తెగులు నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బ్యాల్ల మురళికృష్ణ, రైతు సేవ కేంద్రం సిబ్బంది శ్రీవిద్య గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జెఎల్ఎంకు తీవ్రగాయాలు



గాయపడిన వెంకటకృష్ణ

**పుట్లూరు, నవంబర్ 5 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం కందికాపుల గ్రామ సచివాలయంలో జెఎల్ఎంగా నిధులు నిర్వహిస్తున్న వెంకటకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా వున్నాయి. జెఎల్ఎం వెంకటకృష్ణ బుధవారం సూరేపల్లి గ్రామంలో లైన్ మరమ్మత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌పోల్ విరిగి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు తాడిపత్రి క్రీడాకారిణిలు

**తాడిపత్రిటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త**

అనంతపురం ఆర్డీటి స్టేడియంలో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ అండర్-17, అండర్-14 జిల్లాస్థాయి బాలికల కబడ్డి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తాడిపత్రిలోని శ్రీసాయి చైతన్య అకడమీకి చెందిన ఎస్. అర్షియ, ఎస్.అవనిక, చాందిని (అండర్-17), ఎస్.అయిషా (అండర్-14) విభాగంలో ఎంపిక య్యారని కోచ్ లక్ష్మీనరసింహ తెలిపారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలు

## సకాలంలో వేతనాలు అందేలా కృషి చేయండి

- ఎమ్మెల్యే పల్లె సింధూరను కోరిన ఉపాధి టిఏలు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 5, ప్రభాతవార్త**



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న టిఏలు

సకాలంలో వేతనాలు అందక చాలా ఇబ్బం దులకు గురౌతున్నామని సకాలంలో అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి విన్నవించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం సర్వసభ్యసమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే పల్లె సింధూరను కలసి టిఏలు తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. సకాలంలో జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ, పిల్లలు చదువు, ఈఎమ్ఐలు చెల్లించ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అంతే కాకుండా సాంకేతిక సహాయ కులకు మరియు బిఎఫ్‌టీలకు జీతాలను స్కిల్డ్ క్రింద కాకుండా అడ్మిన్ క్రింద చెల్లిం చే విధంగా చూడాలని ఎమ్మెల్యేను కోరినట్లు ఈసీ షెక్షావలి, టిఏలు సాయినాథ్‌రెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఆంజనేయులు, బిఎఫ్‌టి నాగముణి తెలిపారు.

## పంటల తెగుళ్లపై రైతులకు అవగాహన





పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**తలుపుల,నవంబర్05, ప్రభాతవార్త**

మండల పరిధిలోని పులిగిండ్లపల్లి, ఒదులపల్లి గ్రామాల్లో వరి, వేరుశనగ పంటల తెగుళ్లపై రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి నాగ మధుసూదన్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి వరిగింజ నిండే దశలో ఉంది కాబట్టి అక్కడక్కడ కాండం తొలుచు పురుగు, కంకి నల్లి, అగ్గి తెగులు వంటి వ్యాధులు సోకడంతో వీటి నివారణకై కోర్డాఫ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు, ఒక లీటరు నీటితో, ప్రోఫిన్ పాన్ రెండు ఎమ్మెల్ నీటికి, సైక్లోజోల్75/ ఒక గ్రాము లీటరు నీటిని తీసుకొని పిచికారి చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఒదులపల్లి లో సాగు చేస్తున్న వేరుశెనగ, మినుము పంటలను రైతు సేవా కేంద్ర సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 5, ప్రభాతవార్త**



మాలధారణ భక్తులకు బిక్ష ఏర్పాటు చేసిన భక్తుడు

మండల కేంద్రానికి సమీపంలో ఎం.కొత్తపల్లి బండపై శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామివారి దేవస్థానంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారి మూల విరాట్ విగ్రహానికి సుగంధ ద్రవ్యాలు,వివిధ పుష్పాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహిం చారని ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు గురుస్వామి తెలిపారు. ప్రతి యేటా కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమికి దాత పెయింటర్ ప్రసాద్ స్వామివారికి పూజా సామాగ్రి అందించి ప్రత్యేక పూజలు నిర్వహించి,అనంతరం భక్తులకు వన భోజనాలు ఏర్పాటు చేయడం ఆన వాయితీగా వస్తోందని, అందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉపాల యాల్లో పూలు పండ్లు సమర్పించి, అయ్యప్పస్వామి సన్నిధానంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, 46 మంది భక్తులకు బిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

**అనంతపురం రూరల్, నవంబర్ 5 ప్రభాతవార్త**



మార్కండేయ దేవాలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అనంతరూరల్ మం డలం లో కార్తీకపౌర్ణమి పురస్క రించుకొని మం డల వ్యాప్తంగా అన్ని శైవ వైష్ణవ ఆలయాలలో సందడి నెలకొంది. ఉద యాన్నే స్వామివారి మూల విరాట్లకు పంచా మృత అభిషేకాలు, అర్చన, ఆకు పూజలు నిర్వహించారు. సాయం త్రం దేవాలయ ప్రాంగణా లను మహిళలు దీపాలతో అలంకరించారు. లక్ష దీపాలను వెలిగించారు. హైందవ పురాణాల ప్రకారం సంవత్సరం పొడుగునా దీపాలు వెలిగించకపోయినా కార్తీక పౌర్ణమి రోజు 365లు వెలిగిస్తే ఏడాది పొడువున దీపం వెలిగించిన పుణ్యం వస్తుందని హైందవ మతస్తులప్రగాఢ విశ్వాసం. 365 వొత్తులను విశేషంగా ఆలయాల పరిసర ప్రాంతాలలో వెలిగించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలని శివ వైష్ణవ నామాలతో మార్మోగిపోయాయి. అనంతరం దేవాలయాలకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## రుద్రంపేటలో కోటి సంతకాల కార్యక్రమం



కోటి సంతకాల కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, నవంబర్ 05 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజిలను ప్రైవేటు పరం చేయకుండా నిలుపుదల కోసం చేపడుతున్న కోటి సంతకాల కార్యక్రమం ప్రజలలో స్వచ్ఛందంగా దూసుకెళ్లడం జరుగుతుందని ఎంపీటీసీ మహబూబ్ బి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి తెలిపారు. బుధవారం అనంత రూరల్ మండలం పంచాయతీ లోని చంద్రబాబు నగర్,13,15,వ. వార్డు లో వైయస్సార్సీపి జిల్లాఅధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపీటీసీ మహబూబ్ బీ ఆధ్వర్యంలో కోటిసంతకాలప్రజాఉద్యమముకార్యక్రమం నిర్వహించి ప్రజలతో సంతకాలు చేయించారు. ఈకార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు వైయస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరి ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి, షేక్ షా వలి, , వెంకట్రాముడు, కాజా, షాషావలి, అక్కమ్మ, జయమ్మ,, ఆరిఫా, సిమ్మి తదితరులు పాల్గొన్నారు.

# పెన్నహోబిళంలో వైభవంగా 'జ్వాలా దీపోత్సవం'

-కార్తీక పౌర్ణమిను పురస్కరించుకొని నిర్వహణ

-లక్ష్మినరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు



ధ్వజ స్తంభంవద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పెన్నహోబిళంలో దీప స్తంభంపై జ్వాలా దీపం వెలుగుతున్న దృశ్యం, జ్వాలా దీపాన్ని దర్శించుకొంటున్న భక్తులు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం కార్తీక పౌర్ణమిను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం జ్వాలా దీపోత్సవం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుండి లక్ష్మినరసింహ స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాల మధ్య ప్రధానాలయం ముందుగల ద్వీపస్తంభాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు నమోనారసింహ అంటూ నినదిస్తుండగా పదుల అడుగుల ఎత్తులోవున్న ద్వీపస్తంభంపైకి ఎక్కిన ఆలయంలో పనిచేసే వ్యక్తి ఒకరు అనాధిగా వస్తున్న ఆచారం ప్రకారం జ్వాలా దీపాన్ని వెలిగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీచార్, గుందుస్వామి, కార్యాలయ సిబ్బంది మారుతి తదితరులు పాల్గొన్నారు.

# రేణిమాకులపల్లి, నింబగల్లు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ రచ్చబండ

-మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త



రేణుమాకులపల్లి, నింబగల్లు గ్రామాల్లో జరిగిన సంతకాల సేకరణ కార్యక్రమాల దృశ్యాలు



రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం ద్వారా ప్రైవేటు అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వై.ఎన్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని రేణిమాకులపల్లి, నింబగల్లు గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం రాయలసీమ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ప్రణయ్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుండి కోటి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పరిశీలకులు గంగాధర్, డిష్ సురేష్, పార్టీ రూరల్ మండల అధ్యక్షులు జి.ఎర్రిస్వామిరెడ్డి, మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, ఎంపీటీసీ ఈశ్వర్‌బాబు, ఆయా గ్రామాల నాయకులు చిదంబరి, ఓబులేషు, అనుమప్ప, రమేష్, ఓబులప్ప, వీరభద్ర, లింగన్న, జగదీష్, విశ్వనాథ్, శివరాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కార్తీక పున్నమి వేడుకలు

అగళి, నవంబర్ 5 ప్రభాతవార్త



పూజలు నిర్వహిస్తున్న పురోహితులు , శంకరేశ్వర స్వామిని అలంకరించిన దృశ్యం

కార్తిక పున్నమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునుండే అర్చనలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామి మూల విరాట్‌ను అభిషేకం చేశారు. పురోహితులు, పండితులు శాస్త్రోక్తంగా స్వామిపై ప్రార్థనలు చేశారు. ఐదుగురు పురోహితులు కలుసుకుని స్వామిపై స్లోకాలను ఆలపించారు. స్వామి మూల విరాట్‌ను వివిధ రకాలపూలతో అలంకరించారు. కార్తిక పున్నమి వేడుకలకు తుమకూరు, బెంగుళూరు, శిర తదితర పట్టణాల నుంచి అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు. పంచామృతాభిషేకం, మహా మంగళహారతి అనంతరం ప్రసాదాన్ని వితరణ చేశారు. తిరిగి రాత్రి కార్తిక మాస పూజలను నిర్వహించి, దక్షాన్ని కాల్చారు. సాయంత్రం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు ప్రత్యేకంగా పున్నమి వేడుకలను నిర్వహించారు. కార్తిక పున్నమి శివునికి ఇష్టమైన ప్రీతికరమైన రోజు ఈ కార్తిక దీపాలను శివుని దేవాలయం వద్ద, గుడిలో వెలిగిస్తే అంతా శుభం, మంగళకరం జరుగుతుందని, ఐశ్వర్యం సిద్దిస్తుందని భక్తుల విశ్వాసం. మహిళలు శంకరేశ్వర స్వామి దేవాలయం లోపల కార్తిక దీపాలను వెలిగించారు. కార్తిక దీపాలను పసుపు కుంకుమతో, పూలతో అలంకరించి కార్తిక దీపాలను మహిళలు వెలిగించారు. ఉసిరి కాయ పెట్టి కార్తిక దీపాలను వెలిగిస్తే ఐశ్వర్యం సిద్దిస్తుందని భక్తుల విశ్వాసం.

# ఎపిఎన్‌జిజిఓ చురుకుగా సభ్యత్వ నమోదు

అగళి, నవంబర్ 5 ప్రభాతవార్త



సభ్యత్వ నమోదు చేయిస్తున్న దృశ్యం

ఎపిఎన్‌జిజిఓ మడకశిర నియోజకవర్గ యూనిట్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యోగులు చురుకుగా చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అసోషియేష్, మడకశిర ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం అగళి,రొళ్ల మ ండలాల్లో బుధవారం చురుకుగా చేయించారు. అగళి ఎంపిడిఓ కార్యాలయంలో ఉన్న ఉద్యోగులు ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్‌ల సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, రాము, హరినాథ్, మురళీధర్, రమేష్, ఇద్వత్ మడకశిర నియోజకవర్గం సంఘం కార్యదర్శి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రత్యేక అలంకరణలో శివాలయాలు

తాడిమర్రి నవంబర్ 5 (ప్రభాతవార్త)



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కాటి కోటేశ్వర స్వామి



కాటి కోటేశ్వర ఆలయ సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మండల వ్యాప్తంగా బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం తెల్లవారు జామునుండే మహిళలు పెద్దఎత్తున శైవ క్షేత్రాలకు తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు భక్తుల తాకిడితో ఆలయాలన్నీ కిటకిట లాడాయి. చిల్లవారి పల్లి గ్రామ సమీపంలో భక్తుల కొంగుబంగారంగా వెలసిన శ్రీ కాటి కోటేశ్వర స్వామి క్షేత్రం తోపాటు మండల సరిహద్దులో వెలసిన కోన మల్లేశ్వర స్వామి మరియు మండల కేంద్రంలోని పురాతన శివాలయం, ఏకపాదం పల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం, తోపాటు మండల వ్యాప్తంగా వెలసిన హిందూ దేవాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని. ఆలయాలకు తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# రహదారిపై తొలగిన మురుగు

వజ్రకరూరు నవంబరు 5 ప్రభాతవార్త



రహదారిపై వేసిన ఎర్రమట్టిని తొలగిస్తున్న అధికారులు

వార్త ప్రభావం

మండలంలోని పంది కుంట గ్రామంలో గొల్ల వారి వీధిలో రోడ్డుపైన మురుగునీరు నిలిచి పరిసర ప్రాంతం మురికి కూపంగా మారింది. ఈ విషయాన్ని ఈనెల3న మురికి కూపాంగా వీధి అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో దామోదర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ మంజునాథ్, గ్రామ కార్యదర్శి వెంకటేశు, ఏ ఎస్ ఐ రమేష్ లు బుధవారం గ్రామానికి వెళ్లి రహదారిపై నీరు ముందుకు వెళ్లకుండా వేసిన ఎర్రమట్టిని జెసిబిల సహాయంతో తొలగించారు. స్థానికులకు పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. పరిశుభ్రంగా ఉంచుకొని రోగాలపరిని పడకుండా ఉండాలని సూచించారు. రహదారిపై మురుగు సమస్య తొలగడంతో స్థానికులు అనందపడ్డారు. సమస్యను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో చొరవ చూపిన వార్తాపత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# నియోజకవర్గంలో 5మండలాల్లో అంబేద్కర్ స్మృతివనంలు ఏర్పాటు చేయండి

అమరాపురం నవంబర్ 5 ప్రభాతవార్త



దళిత నాయకుల దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురంలో అంబేద్కర్ స్మృతి వనంలో బుధవారం నియోజక వర్గ దళిత నాయకులు అమరాపురం స్మృతి వనం నందు అమరాపురం స్మృతి వనం అధ్యక్షుడు ఏ నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళితనాయకులు ఉప్పార్లపల్లి శివన్న, జయరాజు, మంజునాథ్,నగేష్, ఆటో తిప్పయ్య, రామచంద్రప్ప, సిద్దేశ్వర, సిద్దేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న అది నీ పార్టీలలోని ముఖ్య దళిత నాయకులు పార్టీలకు అతీతంగా సమావేశం నిర్వహించి అన్ని మండల కేంద్రాలతో పాటు మడకశిర పట్టణమునందు అంబేద్కర్ స్మృతి వనాలను ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని వారు కోరారు. అదేవిధంగా ఎంతోమంది దళిత ఉద్యోగస్తులు ,మేధావులు, దళిత వ్యాపారవేత్తలు మరియు దళిత యువకులతో పాటు అన్ని పార్టీలలోని రాజకీయ ముఖ్య నాయకులు పార్టీలకు అతీతంగా సమావేశాన్ని నిర్వహించి అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలని దళిత నాయకులు చర్చించారు

# విద్యుత్తు షాక్..గొర్రె మృతి

రొళ్ల నవంబర్ 5 ప్రభాతవార్త:



విద్యుత్ శాఖకు గురైన గొర్రె



విద్యుత్ ట్రాన్స్పార్మర్‌కు అల్లుకున్న చెట్లు

విద్యుత్తు షాక్ కు గురై గొర్రె మృతి చెందిన ఘటన బుధవారం రొళ్ల మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గిడ్డ బొమ్మనహళ్లి గొల్లహట్టికి కాంత్ రాజుకు చెందిన గొర్రె విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు.మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల మైదానంలో మేజర్ పంచాయతీకి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ ను పాఠశాల మైదానంలోనీ చెరువుకు ఆనుకొని విద్యుత్ ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేశారు.ఈ క్రమంలో ట్రాన్స్పార్మర్ కు ఏర్పాటు చేసిన న్యూటల్ వైరుకు అటువైపు వెళ్లినా గొర్రె మేతమేస్తూ షాక్ కు గురై అక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. కాంతరాజు మాట్లాడుతూ.. గొర్రెలతోనే తన కుటుంబ పోషణ ఆధారపడి ఉందని గొర్రె మృతి చెందడంతో తనకు రూ.10వేలు వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే పాఠశాల మైదానంలో విద్యార్థులు నిత్యం ట్రాన్స్పార్మర్ పక్కనే సంచరిస్తున్నారు. ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేసి దానికి భద్రత లేకుండా వదిలివేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.విద్యుత్ శాఖ వారు ఇకనైనా స్పందించి ప్రమాదాలకు నిలయంగా ఉన్న ట్రాన్స్పార్మర్‌కు కంచె ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# ధర్మవరంలో మూడు రోజులపాటు తాగునీటి సరఫరా బంద్

**ధర్మవరంటౌన్, నవంబరు 5 ప్రభాతవార్త** : ధర్మవరంలో ఈనెల 11,12,13 తేదీల్లో మూడు రోజులపాటు తాగునీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఇన్చార్జ్ కమిషనర్ సాయికృష్ణ, డీఈ వీరేశ్ లు బుధవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు.ధర్మవరం పట్టణానికి అవసరమయ్యే తాగునీటిని పార్నపల్లి డ్యాం తంబాపురం తిక్కస్వామి నగర్ వద్దగల ఫిల్టర్ రేషన్ ప్లాంటుకు పెద్ద మోటార్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తంబాపురం వాటర్ వర్క్స్ వద్దగల మ్యానిఫర్డ్ చాలా ఏళ్ల నాటిదికావడంతో దెబ్బతిందన్నారు. దీంతో తాగునీరు వృథాగా పోతోందని దాని స్థానంలో కొత్త ఎంఎస్ మ్యానిఫర్డ్ తయారుచేసి అమర్చడం కోసం మూడు రోజులు సమయం పడుతుందని కావున పట్టణ ప్రజలు మున్సిపాలిటీ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని వారు కోరారు.

# మంత్రి సత్యకుమార్ చొరవతో డ్యాం కుడికాలువ గేట్ల మరమత్తులకు రూ.29లక్షలనిదులు మంజూరు

పీఏబీఆర్ డ్యాం గేట్ల మరమత్తులు త్వరగా పూర్తీ చేస్తాంమంత్రి సత్యకుమార్యాదవ్

ధర్మవరంటౌన్, నవంబరు 5 ప్రభాతవార్త



మంత్రి సత్య కుమార్ (ఫైల్ ఫోటో)

అనంతపురం జిల్లాలోని పెన్నా అహోబిలం బ్యాలెన్స్ రిజర్వాయర్(పీఏబీఆర్) డ్యాం కుడివైపు హెడ్ స్లూయిస్ గేట్ల మరమత్తుల కోసం రూ.29లక్షలనిధులను జలవనరుల శాఖ మంజూరు చేయడం జరిగిందని. వాటి మరమత్తులను త్వరలో పూర్తీ చేస్తామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం నీటి నిల్వ సామర్థ్యాన్ని కాపాడుతూ, సాగునీటిని సమయానికి రైతులకు అందించే దిశగా చర్యలు ప్రారంభించిందన్నారు. పీఏబీఆర్ డ్యాం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు మండలాల రైతులకు జీవనాధారమన్నారు. అయితే గేట్ల లోపాల కారణంగా గత కొన్నేళ్లగా సాగునీటి విడుదల ఆలస్యమవుతోందన్నారు. ఈసమస్య ను ప్రాధాన్యతగా తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అధికారులను పునరావృ తంగా ఆదేశిస్తు అవసరమైన సాంకేతిక వివరాలను సేకరించి నిధులు మం జూరుచేశారన్నారు.పనులు పూర్తీ అయిన వెంటనే కుడికాలువ ద్వారా సాగునీటి విడుదల చేయడం జరుగుతుందన్నారు. పనులుపూర్తి అయితే రైతులు పొలాలకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

# మహిళ హత్యకేసులో నిందితుడు అరెస్టు

ధర్మవరంటౌన్, నవంబరు 5 ప్రభాతవార్త



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

మహిళ హత్య కేసులో ఓ నిందితుని అరెస్టు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. బుధవారం అరెస్టుకు సంబంధించిన అరెస్టు వివరాలను విలేఖరుల సమావేశంలో సీఐ రెడ్డప్ప వెల్లడించారు. సీకేపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన సాకే వెంకటరాముడు ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో తన భార్య సరస్వతితో కలిసి నివాసం ఉండేవాడు. అయితే సాకే వెంకటరాముడు తన భార్య సరస్వతి అల్లుడితో అక్రమ సంబంధం పెట్టుకుందని, తన ప్రవర్తన మార్చుకొమ్మని ఎంత చెప్పిన వినలేదు. దీంతో సాకే వెంకటరాముడు తన అక్క చిట్టెమ్మ, ఆమె భర్త రామంజి, మరో అక్క వెంకటలక్ష్మీ, వదిన రామాంజినయుల సహాయంతో సరస్వతిని చంపేసి నరసింహులు విజయ్ ల సహాయంతో పట్టణ సమీపంలోని గొల్లపల్లి వంకలో పూడ్చివేసిన విషయంతెలిసిందే. దర్యాప్తులో భాగంగా సాకే సరస్వతిని భర్త సాకే వెంకటరాముడు చంపినట్టు నిర్ధారణ కావడంతో వెంకటరాముడుతో పాటు మరో ఆరు మందిపై అప్పట్లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇదివరకే ఆరు మందిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరిగిందన్నారు. మిగిలిన ఒక నింధితుడు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో పక్కా సమాచారం మేరకు ధర్మవరం పట్టణంలోని మహాత్మాగాంధీ కాలనీకి చెందిన కావడి రామాంజినేయులు అలియాస్ రామాంజి బుధవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో లక్ష్మీచెన్నకేశవపురం వద్దగల పీహెచ్ సి వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయండి

వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న

అమరాపురం నవంబర్ 5 ప్రభాతవార్త



అంబేద్కర్ విగ్రహానికి వేస్తున్న దృశ్యం



కోటి సంతకాల సేకరణ దృశ్యం

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని మడకశిర నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఈర లక్కప్ప, మడకశిర నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివన్న లు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన అమరాపురం నందు ఎస్సి సెల్ ఆధ్వర్యంలో ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి మరియు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి వైకాపాప్రభుత్వంలో అమలు చేసిన 17 మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ రద్దు చేయాలని అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు పూర్తి చేసి రాష్ట్రంలోని నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు వైద్య విద్య పట్ల ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ చేస్తే నిరుపేదలకు వైద్య విద్య అందని ద్రాక్ష పండులా తయారవుతుందని వారు ఆరోపించారు. కోటి సంతకాలను ప్రజల నుండి సేకరించి ప్రజాభిప్రాయాల మేరకుత్వరలో రాష్ట్ర గవర్నర్ కు విన్నవించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ త్రిలోక్నాథ్, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి,నియోజకవర్గ ఐటీ వింగ్ గొల్లమారనపల్లి చిత్తన్న, ఎంపీటీసీలు నాగభూషణ్, నారాయణ గౌడ, మద్దనకుంట హనుమంత రాయ,కేంచప్ప, సీనియర్ వైకాపానాయకులు ఏ .నారాయణ, ఆటో తిప్పయ్య, జెకె మూర్తి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మంజు, బీడీ మూర్తి, నంజుండ, మల్లికార్జున సురేష్, పంచాయతీ కన్వీనర్ జోగేంద్ర, అంజలి, రామచంద్రప్ప, జయరాజు, నగేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

వజ్రకరూర్ నవంబర్ 5 ప్రభాతవార్త



విశేషాలంకారములో శ్రీ భోగేశ్వర స్వామి



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మండల వ్యాప్తంగా అన్ని శైవ,వైష్ణవఆలయాలలో సందడి నెలకొంది. ఉదయాన్నే స్వామివారి మూల విరాట్లకు పంచామృత అభిషేకాలు, అర్చన, ఆకుపూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణాలను మహిళలు దీపాలతో అలంకరించారు. లక్షదీపాలను వెలిగించారు. హైందవ పురాణాలప్రకారం సంవత్సరం పొడుగునా దీపాలువెలిగించకపోయినా కార్తీక పౌర్ణమి రోజు 365లు వెలిగిస్తే ఏడాది పొడువున దీపం వెలిగించిన పుణ్యం వస్తుందని హైందవ మతస్తులప్రగాఢ విశ్వాసం. 365 వొత్తులను విశేషంగా ఆలయాల పరిసర ప్రాంతాలలో వెలిగించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలని శివ వైష్ణవ నామాలతో మారు మ్రైగాయి.

# వీధిలైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, నవంబర్ 05, ప్రభాతవార్త



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే,కలెక్టర్, మాజీమంత్రి

పుట్టపర్తి పట్టణంలోని చిత్రావతి బ్రిడ్జి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వీధి లైట్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మరియు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం చిత్రావతి నదీ పరివాహక ప్రాంతంలో సుందరీకరణ పనులను, జోయా లుక్కాస్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో పుడా చిల్డ్రన్ పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను సైతం పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అంతకుముందు హారతి ఘాటు వద్ద ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని చిత్రావతి నదిలో దీపాలను వెలిగించి నదిలోకి వదిలారు. జిల్లా కలెక్టర్ ,ఎమ్మెల్యే ,మాజీ మంత్రి వెంట ఆర్డీవో సువర్ణ, డిఎస్పి విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ నరసింహ మూర్తి , సీఐ శివాంజనేయులు టిడిపి నాయకులు బోయ రామాంజనేయులు,సామకోటి ఆదినారాయణ, గంగాధర్ నాయుడు,సురేష్ చౌదరి,దేవనాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిసీ కార్పొరేషన్ ఛైర్మన్‌ల సమావేశంలో పాల్గొన్న లక్ష్మీనారాయణ

మడకశిర నవంబర్ 05 ప్రభాతవార్త:



మాట్లాడుతున్న కుంచటిగ వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ



మంత్రికి వినతి పత్రాన్ని ఇస్తున్న లక్ష్మీనారాయణ

విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్ లో బుధవారం జరిగిన బిసి సంక్షేమ శాఖ మరియు చేనేత జౌళి శాఖమాత్యులు శ్రీమతి సవితమ్మ అధ్యక్షతన బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ల సమావేశంలో కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆదరణ 3.0 పథకం గురించి, బీసీల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాల పైన అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల గురించి సమావేశంలో చర్చించారు. ఆయా కులాలకు సంబందించిన సమస్యల పైన చర్చించారు. అదేవిధంగా కార్పొరేషన్ ఛైర్మన్ లు అందరి ని మంత్రి గౌరవప్రదంగా సన్మానించారని తెలిపారు. లక్ష్మీనారాయణ కుంచిటిగ వక్కలిగల సంక్షేమ మరియు అభివృద్ధి కోసం వినతి పత్రాన్ని మంత్రి కి అందించారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని కుంచటిగ వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ తెలిపారు.

# లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర నవంబర్ 05 ప్రభాతవార్త:

కార్తీక మాసం లో వచ్చే పర్వ దినమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా కర్ణాటక రాష్ట్రం లోని ప్రఖ్యాత శివక్షేత్రమైన సిద్దరబెట్ట శ్రీ సిద్దేశ్వర స్వామి వారిని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయంలో జరిగిన లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నాగరాజు క్లస్టర్ ఇంచార్జ్ రవికుమార్ లు పాల్గొన్నారు.

# వన భోజనాలతో ఐక్యత, స్నేహభావం..

మడకశిర టౌన్ నవంబర్ 05 ప్రభాతవార్త.



కార్తీక మాసం వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పతాంజలి సిబ్బంది

ఆధ్యాత్మికత, ఐక్యతకు స్నేహ భావాలకు కార్తీక మాస వనభోజన మహోత్సవాలు ప్రతీకలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. బుధవారం మడకశిర మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో పట్టణానికి చెందిన పతాంజలి యోగ సిబ్బంది తరపున ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన మహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ : నియోజకవర్గ వ్యాప్తంగా కార్తీక మాస వనభోజన మహోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్తీక మాస వనభోజన మహోత్సవాల ద్వారా ఆధ్యాత్మిక భావాలు సభ్యుల మధ్య సోదర భావాలు పెంపొందుతాయన్నారు.పూర్వం నుంచి సమాజ శ్రేయస్సు కోసం వనభోజన మహోత్సవాలు ఆచారంగా నిర్వహించే వారందరూ ఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న పతాంజలి యోగ సిబ్బందికు అభినందనీయమన్నారు. ప్రజలందరికీ కార్తీక మాస శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పతాంజలి యోగ సిబ్బంది మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కు ఘన స్వాగతం పలికి శాలువా పూల వాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు. జడ్పిటిసి ఉమేష్. కౌన్సిలర్లు సుభద్ర నాగేంద్ర. ఉమాశంకర్.సీనప్ప. పట్టణ కార్యదర్శి తిమ్మరాజు. ఆగలి టిడిపి నాయకుడు జయప్ప. బిజెపి సీనియర్ నాయకులు పురుషోత్తం. పతాంజలి యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐకు స్థానిక టిడిపి నేతలు సన్మానం

రొళ్ల నవంబర్5 ప్రభాతవార్త:



ఎస్ఐను సన్మానిస్తున్న స్థానిక టిడిపి నేతలు

మండల నూతన ఎస్ఐ ను స్థానిక టిడిపి నేతలు సన్మానించారు. ఇటీవల్ల బదిలీపై వచ్చి ఎస్ఐగా వీరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకుబుధవారం స్థానిక టిడిపి నేతలు మండల కన్వీనర్ ఈరన్న, డైరెక్టర్ రామకృష్ణ,బీసీ సెల్ అధ్యక్షులు నాగరాజ్, మాజీ ఎంపీపీ కృష్ణప్ప,నాయకులు యోగానంద్,నాగేంద్ర, తదితరులు కలిసి ఎస్ఐకు పూల మాలలతో శాలువా కప్పి సత్కరించారు. వెనుకబడిన మండల అభివృద్ధికి సహకరించి అసంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని ఎస్ఐను కోరారు.ఎస్ఐ స్పందిస్తూ మండలంలో ఎక్కడ కూడా అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వ బోమ్మన్నారు.

## లత్తవరంలో అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన

-వివిధ అంశాలను వివరించిన డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటరమణ

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త



లత్తవరంలో అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.వెంకటరమణ

పెద్ద కౌకుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని లత్తవరం గ్రామంలో బుధవారం సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీచందన పర్యవేక్షణలో ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ యం.వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యంగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, స్త్రీలలో రొమ్ము కాన్సర్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మగవారిలో నోటి, ఊపిరితిత్తుల, జీర్ణాశయ, చిన్న, పెద్ద ప్రేగు క్యాన్సర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని వివిధ రకాల కాన్సర్ల యొక్క లక్షణాలను సవివరంగా వివరించారు. కాలాగుణంగా సంభవించే కీటకజనిత వ్యాధులైన అత్యంత ప్రమాదకరమైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు లాంటి వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు ఉత్పత్తి కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలందరూ తప్పనిసరిగా ప్రతి శుక్రవారంను డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు ప్రసాదరావు, ఎంఎల్‌హెచ్‌పీ పవన్‌కళ్యాణ్, ఏఎన్ఎం చంద్రకళ, ఆశ కార్యకర్తలు అరుణ, సుజాత, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండకు చేరిన ఎస్ఎఫ్ఐ జీపు యాత్ర

-బాలికల జూనియర్ కళాశాలకు సొంత భవనాల ఏర్పాటుకు డిమాండ్

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



హాజరైన విద్యార్థులు

జిల్లాలో మరుగున పడిన విద్యార్థుల సమస్యలను వెలికితీసి వాటి పరిష్కారానికై జిల్లాలో విద్యారంగ అభివృద్ధికై పాటు పడేందుకుగాను ఈనెల 3వ తేదీ నుండి అనంతపురం నుండి ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ జీపు యాత్ర బుధవారం ఉరవకొండకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తరిమెల హరి, ఒతూరు పరమేష్ మాట్లాడుతూ జీపు యాత్ర 5 రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు ఉరవకొండ పట్టణంలో విద్యార్థులు సమస్యల నడుమ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని ముఖ్యంగా బాలికల జూనియర్ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలకు అనుబంధంగా కళాశాల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని అనేక ఉద్యమాలు నిర్వహిస్తే కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. జూనియర్ కళాశాలకు బస్సు సరిగ్గాలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చాలని, క్రీడారంగ అభివృద్ధికి పీడీలు, పీఈటీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు హరూన్‌రషీద్, భీమేష్, శివ, వంశీ, జిల్లా నాయకులు విజయ్, జయవర్ధన్, ఓబు, మండల అధ్యక్షుడు రాజేష్, నాయకులు సిద్ధార్థ, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలు, కళాశాలల సమయానికి అనుగుణంగా బస్సులు నడపండి

-ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించిన ఏబీవీపీ నాయకులు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త



ఆర్టీసీ డిపో మేనేజర్ వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

పాఠశాలలు, కళాశాలల సమయానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడపాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు బుధవారం ఉరవకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు హంపన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివరాజ్ మాట్లాడుతూ ఉరవకొండ చట్టుప్రక్కలగల పాల్తూరు, హొన్నూరు, హావళిగి, గోవిందవాడ తదితర గ్రామాలకు సక్రమంగా బస్సులు నడవకపోవడంతో విద్యార్థులు ఉరవకొండలోని పాఠశాలలు, కళాశాలలకు సరైన సమయానికి చేరుకోలేకపోతున్నారన్నారు. దీంతో వారు చదువులో వెనుకబడుతున్నారని డీఎం దృష్టికి తెస్తూ బస్సుల సమయాలను మార్చాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ బాగ్ కన్వీనర్ నిఖిల్ తేజ, కార్యకర్తలు సురేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## మారుకా మచ్చల పురుగు, కాయ తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టండి

-నింబగల్లులో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఏవో బి.రామకృష్ణుడు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త



కంది పొలంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

కంది పంట పూత, కాయ దశలో ఉందని పంటలో మారుకా మచ్చల పురుగు, కాయ తొలుచు పురుగు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణుడు సూచించారు. మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మారుకా మచ్చల పురుగు, కాయ తొలుచు పురుగు నివారణకు కోరాజిన్ 60 ఎంఎల్ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి లేదా, ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పూత బాగా రావడానికి, పూత రాలకుండా ఉండటానికి బయోజైమ్ 2ఎంల్ మందును లీటరు నీటిలో కలిపి, 19:19:19 యూరియాను ఎకరాకు ఒక కేజీ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ, వివిధ వ్యవసాయ పథకాలపై అవగాహన ఏవో కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

## కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు

-భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త





ప్రత్యేక పూజలందుకున్న గవిసిద్దేశ్వరస్వామి, ప్రత్యేకాలంకరణలో మల్లేశ్వరస్వామి



విశేష పూజలందుకున్న గోపాలకృష్ణుడు

స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం వివిధ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. పట్టణంలోని గవిమఠ సంస్థానంలో వెలసిన గవి సిద్దేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు విరుపాక్షిస్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం అలంకరణ, పూజలు కొనసాగాయి. పురాతన మల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు అంపయ్యస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరిగాయి. జాతీయ రహదారికి పక్కనగల గోపాలకృష్ణుని ఆలయంలో స్వామివారికి అర్చకులు సాయిక్రిష్ణ అభిషేకాలు, విశేష పూజలు కొనసాగాయి. ఉదయం మొదలు రాత్రి కూడా భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు ఆలయాల ఆవరణంలో కార్తీక దీపాలు వెలిగించారు.

## రాకెట్లలో విరబూసిన బ్రహ్మకమలాలు

-పూజలు నిర్వహించిన ఇంటి యజమానులు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త



రాకెట్లలో ముత్తలూరు అనిత ఇంట్లో విరబూసిన బ్రహ్మకమలాలు

ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోగల ముత్తలూరు అనీత ఇంట్లో బుధవారం తెల్లవారు జామున అరుదైన మూడు బ్రహ్మ కమలాలు విరబూసాయి. బ్రహ్మకమలాలు విరబూసిన వెంటనే ఇంటి యజమానులు పూజలు నిర్వహించారు. హిందూ పురాణాల ప్రకారం బ్రహ్మకమలాలపై బ్రహ్మదేవుడు కూర్చుని ఉంటాడని చెబుతారు. అరుదుగా ఏడాదికొకసారి విరబూసే బ్రహ్మకమాలాలు ఇదివరకు హిమాలయా పర్వతాల్లో అరుదుగా లభించిన మొక్క కాగా అది కాలక్రమేనా ప్రతి ఇంటి ఆవరణంలోనూ పెంచడం జరుగుతూ వస్తోంది. ఈ మొక్కపై ఆకులే పువ్వుగా రూపాంతరం చెందుతాయని వృక్ష శాస్త్రవేత్తలు చెబుతారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖోఖో క్రీడాకారులకు క్రీడా దుస్తులు వితరణ

-దాతలైన ముగ్గురు అధ్యాపకులను అభినందించిన ప్రిన్సిపాల్




నూతన క్రీడా దుస్తులతో ఖోఖో క్రీడాకారుతో ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ, పీడీ పి.ప్రశాంత్‌కుమార్ తదితరులు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఖోఖో క్రీడాకారులకు పలువురు అధ్యాపకులు క్రీడా దుస్తులు, యాంకిల్ దుస్తులను సమకూర్చారని కళాశాల ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు బి.ప్రశాంత్‌కుమార్ బుధవారం తెలిపారు. కళాశాల ఖోఖో జట్టు ఈనెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఎస్ఎస్‌జీఎస్ గుంతకల్లులో జరిగే ఎస్.కె.యూనివర్సిటీ గ్రూప్-బి టోర్నమెంట్‌లో పాల్గొంటోందన్నారు. దీంతో కళాశాలకు చెందిన కళాశాల స్టాటిటిక్స్ అధ్యాపకులు డా॥బి.వెంకటరాముడు, ఇంగ్లీష్ అధ్యాపకులు, ఉప ప్రిన్సిపాల్ టి.ఎన్.మస్తానప్ప, హిందీ అధ్యాపకులు డా॥కృష్ణవేణి క్రీడాదుస్తులను అందజేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిరాజ్ అలీఖాన్, సుధాకర్, ఆంజనేయులు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## రాయలప్ప దొడ్డిలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

బ్రహ్మసముద్రం నవంబర్ 5 ప్రభాతవార్త



పశువులకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి

మండలంలోని రాయలప్పదొడ్డి గ్రామం నందు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం బుధవారం ఉదయం 7:30 గంటలకు ప్రారంభించారు ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా పశు సంవర్ధకశాఖ సంచాలకులు జాయింట్ డైరెక్టర్ డా. ప్రేమ్ చంద్ ,పశుగణాద్రి గణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ జివెంకటేష్, అసిస్టెంట్ డైరెక్టర్ అయినటువంటి డాక్టర్ పద్మనాభం పశువైద్యాధికారి డాక్టర్ బి. నాగబాబు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు ఈ కార్యక్రమం గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొని వారి పశువులకు గర్భకోష చికిత్సలు చేయించుకొని ఈ కార్యక్రమంలో తగు సూచనలు రైతులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో లింగ నిర్ధారణ వీర్యం కేవలం పైదూడలు పుట్టే వీర్యం( సెక్స్ సార్టెడ్ సెమెన్) ప్రాముఖ్యతను రైతులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న పశు వైద్య సిబ్బందికి గర్భ కోశ చికిత్స మరియు మెలకువలను రైతులకు తెలియజేశారుసుమారు 105 పశువులకు గర్భకోశ చికిత్స అందించినట్టు పశు వైద్యాధికారి నాగబాబు తెలిపారు.

## 2వ వార్డులో సంతకాల సేకరణ

గుంతకల్లు, నవంబర్ 5 ప్రభాతవార్త

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్‌సిపి చేపడుతున్న సంతకాల సేకరణలో భాగంగా బుధవారం స్థానిక 2వ వార్డులోని బెస్త కాలనీలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి ఆదేశాల మేరకు సంతకాల సేకరణ చేపట్టినట్లు ఎస్‌టి సెల్ నాయకులు గోవింద్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పామిడి మండల నాయకులు మల్లి, రాజారెడ్డి, ఎ.గౌస్, వేణు, దర్గా గౌస్, రాజునాయక్, వార్డు వాలంటీర్ మక్బుల్‌బాష పాల్గొన్నారు.

## కరాటేతోనే ఆత్మరక్షణ



ఆత్మరక్షణ కరాటే కార్యక్రమాన్ని ప్రారంబిస్తున్న ఎంఈఓ గోపాలానాయక్

ధర్మవరంటౌన్, నవంబరు5 ప్రభాతవార్త

ప్రతి విద్యార్థి కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణ ఉంటుందని ఎంఈఓ 2 గోపాల్ నాయక్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని తమకు తాము రక్షించుకునే విధంగా కరాటే ఎంతోగానే దోహదపడుతుందని గుర్తించి సెల్ఫ్ డిఫెన్స్ రక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఎంఈఓ2 గోపాల్ నాయక్ ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కరాటే వంటి యుద్ధకలలను కచ్చితంగా ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకుని తమకు తాము రక్షించుకునే విధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 1వతేదీనుంచి డిసెంబరు 30వతేదీ వరకు ప్రతి రోజు క్లాసులు జరుగుతాయన్నారు. అదేవిధంగా ధర్మవరం మండల కన్వీనర్ గా 16 పాఠశాలలకు ఇంచార్జ్ ఇవ్వడం ఆనందంగా ఉందని కరాటే మాస్టర్లు ఇనాయతాబాషా, నవ్యశ్రీలు పేర్కొన్నారు

## కర్ణాటక బార్డర్ రోడ్డును పరిశీలించిన రాష్ట్ర ఏపీ ఆర్డీసీ మేనేజింగ్ డైరెక్టర్



రోడ్డు పరిశీలిస్తున్న ఆర్ అండ్ బి ఉన్నతాధికారుల దృశ్యం

అమరాపురం నవంబర్ 5 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురం నుండి కర్ణాటక బార్డర్ విరుప సముద్రం ఆర్ అండ్ బి రోడ్డును రాష్ట్ర ఏపీఆర్డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరిశీలించారు. గత వైకాపా ప్రభుత్వంలో రోడ్డు పనులను కాంట్రాక్టర్ కంకర వేసి అనంతరం పనులను నిలిపివేయడం విజితమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు అర్థాంతరంగా ఆగిపోయిన అమరాపురం విరప సముద్రంకర్ణాటక బార్డర్ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరడంతో గత వారం రోజుల క్రితం ఆర్ అండ్ బి ఎస్ఈ మురళీకృష్ణ, ఈ ఈ సంజీవయ్య, డి ఈ లక్ష్మీనారాయణ, ఏ ఈ నరసింహమూర్తిలు రోడ్డును పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడంతో దీనిపై పరిశీలన నిమిత్తం రాష్ట్రమేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం విచ్చేసి అమరాపురం నుండి విరపసముద్రం కర్ణాటక బార్డర్ వరకు రోడ్డు ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. సంబంధితఅధికారులు ఇచ్చిన నివేదిక ఆధారాలను పరిశీలించి త్వరలో రోడ్డు పనులను ప్రారంభించడానికి ఎస్టిమేషన్ తయారుచేసి పంపించాలని సంబంధిత ఆర్ అండ్ బి అధికారులను ఆయన ఆదేశించారు. త్వరలో పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లాస్ 1 కాంట్రాక్టర్ గుండుమల జయప్ప, టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల క్లస్టర్ కన్వీనర్ నవీన్ కుమార్, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు, సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, దాదా పీర్, క్లస్టర్ కో కన్వీనర్ చెన్నప్ప, మాజీ ఎంపిటిసి చంద్రప్ప, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, బిఎస్ నాగరాజు, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, తమ్మడేపల్లి పంచాయతీ కన్వీనర్ ఎల్ఐసి నాగరాజ్, తదితరులు పాల్గొని సత్వరమే రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు.

## నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి ధర్మతేజ

బ్రహ్మ సముద్రం నవంబర్ 5 ప్రభాతవార్త



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ధర్మ తేజ

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ నెల 08న కళ్యాణదుర్గంలో నిర్వహిస్తున్న కనకదాసు జయంతి, విగ్రహావిష్కరణ వేడుకలకు ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విచ్చేస్తున్న సందర్భంగా బుధవారం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు అధ్యక్షతన మండల కేంద్రంలోని శివాలయం దగ్గర మండల వ్యాప్తంగా ఉన్న కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధర్మతేజ పాల్గొని బ్రహ్మ సముద్రం మండల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చేలా చేసి లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోనీ ఈశ్వర దేవాలయం దగ్గర ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తలతో టీడీపీ నాయకుడు ధర్మతేజ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాలబండ్ల శ్రీరాములు జడ్పీటీసీ ప్రభావతి మండల టీడీపీ నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.

## వరుస వర్షాలతో ఆందోళనలో మామిడి రైతులు

బుక్కపట్నం, నవంబర్ 05, ప్రభాతవార్త

గత రెండు నెలలుగా వరుసగా కురుస్తున్న వర్షాలతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు సెప్టెంబర్ నెలలో మామిడి చెట్లకు ఎండలు అవసరం కాగా, వర్షాలు ఎక్కువ కురవడంతో సరైన వేడిమి లేక పూత సరిగ్గా పోయలేదు. దీంతో రైతులు కల్తార్ అనే మందును సైతం మామిడి చెట్లకు వాడడం జరిగింది. అయితే గత రెండు నెలలుగా వరుస వర్షాలతో చెట్లకు చల్లదనం ఎక్కువ కావడంతో మామిడి పూత నిలుస్తుందా అనే సందేహాన్ని రైతుల వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ ఆశలపై అధిక వర్షాలు నీళ్లు చల్లేలా ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుక్కపట్నం మండలంలో వేరుశనగ తర్వాత వేలాది ఎకరాల్లో సాగు చేసే మామిడి పంట దిగుబడిపై రైతుల్లో ఆందోళన నెలకొంది. మామిడి పంటకు నీటితోపాటు వేడిమి చాలా అవసరం. కాగా వరుస వర్షాలతో భూమి చలువ ఎక్కడంతో పంట దిగుబడిపై రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యాపారులు ముందస్తుగానే తోటలను లీజుకు మాట్లాడుకుని పంటలను కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్ట పంట దిగుబడి తగ్గితే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా వ్యాపారస్తులు తోటలను కొనడానికి ముందుకు వస్తుండడంతో అంతా దేవుని దయ అంటూ రైతులు తెలియజేస్తున్నారు.



సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

## 12న అనంతపురంలో జరిగే బస్సుజాత ముగింపు సభను జయప్రదం చేయండి

-హలో విద్యార్థి-ఛలో అనంతపురం కరపత్రాలను విడుదల చేసిన ఏఐఎస్ఎఫ్



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర ంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బస్సు జాత ముగింపు సభ ఈనెల 12వ తేదీన అనంతపురంలో జరుగుతుందని విద్యార్థులందరూ పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తగ్గుపర్తి చందు పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన సమాఖ్య స్థానిక నాయకులతో కలిసి హలో విద్యార్థి-ఛలో అనంతపురం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తగ్గుపర్తి చందు మాట్లాడుతూ గత నెల 22వ తేదీన ఇచ్ఛాపురంలో ప్రారంభమైన బస్సు జాత 12వ తేదీతో ముగుస్తోందన్నారు. ఎన్నికల్లో విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ ఫీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లోవున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ 6,400 కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పీపీపీ విధానం ద్వారా ప్రైవేటుకు అప్పగించాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకివస్తే 100 రోజుల్లో వైద్య విద్యకు అశనిపాతంగా మారిన జీవో నంబర్ 107, 108, పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేసే జీవో నంబర్ 77ను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల కేజీబీవీ మోడల్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని, ఖాళీగావున్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని, సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగావున్న బోధన, బేధనేతర పోస్టులు భర్తీ చేయాలని బస్సు జాత ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కరుణాకర్, కోశాధికారి రాజు, నాయకులు సిద్దిక్, మన్సూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో ఘనంగా కార్తీక పౌర్ణమివేడుకలు



గాంధీనగర్లో మంచుకొండల్లో ఉన్న శివలింగం



మార్కెండేయ స్వామిఆలయంలో శివలింగ రూపంలో వెలిగించిన దీపాలు

ధర్మవరంటౌన్, నవంబరు 5 ప్రభాతవార్త

పట్టణంలోని పలు శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్, శివానగర్, గాంధీనగర్ శివాలయాలతో పాటు పలు దేవాలయాల్లో కూడా ప్రత్యేకంగా అలంకరించి పూజలుచేశారు. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. లక్ష్మీనగర్లో



మార్కెండేయ ఆలయం ముందు వెలిగించిన జ్వాలాదీపం

శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం ఎదుట ధ్వజస్తంభంపై ఆకాశదీపాన్ని వెలిగించారు. అనంతరం జ్వాలాతోరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీనగర్లో మంచుకొండల్లో ఉన్న శివుడు భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా మార్కెండేయ స్వామి ఆలయంలో శివలింగ ఆకారంలో దీపాలు వెలిగించారు. జ్వాలాదీపం కూడా వెలిగించారు. మహిళలు ఆలయాల ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

## సత్య సాయి జయంతి వేడుకలకు 27 లక్షల శానిటేషన్ పరికరాలు

పుట్టపర్తి రూరల్ 05 ప్రభాతవార్త :



పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

సత్యసాయిబాబా శతాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో మున్సిపాలిటీ ముందస్తు చర్యలో భాగంగా దాదాపు 27 లక్షల విలువచేసే శానిటేషన్ పరికరాలను కొనుగోలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం శానిటేషన్ పరికరాలను స్థానిక శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చెరువుతో మున్సిపాలిటీ సాధారణ నిధుల నుండి శానిటేషన్ పరికరాలను కొనుగోలు చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించి చెత్త తరలించడానికి తోపుడు బండ్లు, సున్నము, బ్లీచింగ్ పౌడర్, కార్మికులకు జాకెట్లు, మాస్కులు, బూట్లు, ఫాగింగ్ యంత్రాలు తోపాటు దాదాపు 27 లక్షల విలువ చేసే పరికరాలను కొనుగోలు చేసినట్లు మున్సిపాలిటీ సాధారణ నిధులనుండి కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే పల్లెసింధూరరెడ్డి ఆదేశాలతో కొనుగోలు చేసినట్లుతెలిపారు. ఈసందర్భంగా శానిటేషన్ పరికరాలను కార్యాలయంలో నిల్వచేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ డిఈ నరసింహమూర్తి, ఏఈలు స్వాతి, రాజశేఖర్‌రెడ్డి, రాజేష్ కాంట్రాక్టర్ రమణ పాల్గొన్నారు.

## హేమావతి సిద్దేశ్వరుని సన్నిధిలోకార్తీక పౌర్ణమి వేడుకలు

అమరాపురం నవంబర్ 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి హింజేరు సిద్ధేశ్వర స్వామి దేవాలయం నందు కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారంఆర్యవైశ్యులు అశ్వత్‌నారాయణ కుటుంబ సభ్యులచే ఘనంగా నిర్వహించారు. స్వామివారి కార్తీక పౌర్ణమి విశేష పూజల సందర్భంగా అశ్వత్ నారాయణ కుటుంబ సభ్యులు దీపాలు వెలిగించి మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా హింజేరుసిద్దేశ్వరస్వామి మూల విగ్రహానికి అభిషేకం అర్చనలు రుద్రాభిషేకం విశేష పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఆలయఅర్చకులు ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేయడం జరిగింది. మానవకృతిలో దర్శనమిచ్చే ఈశ్వరుని కార్తీక పౌర్ణమి సందర్భంగా దర్శించడానికి ఆంధ్ర కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేశారు.

